సాక్షి
వరంగల్
ఆదివారం । 16 । జూన్ । 2024



ఫిట్‌లెస్' స్కూల్ బస్సులపై కొరడా
ఫిట్‌నెస్ చేయించుకోని, నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై రవాణాశాఖ కొరడా ఝుళిపిస్తోంది.
- 8లో▸



ఎవరి ట్రాప్‌లో.. ఎవరో
ములుగు జిల్లా వాజేడు- వెంకటాపురం(కె) మండలాల గొత్తికోయ గూడేల్లో ఆందోళన కర వాతావరణం నెలకొంది.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/26^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేడి ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ సర్వేను వేగవంతం చేయాలి



చెన్నారావుపేట: గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లాల ఆన్‌లైన్ సర్వేను వేగవంతం చేయాలని నర్సంపేట ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ వేదవతి అన్నారు. మండలంలోని అమీనాబాద్, చెన్నారావుపేట గ్రామాల్లో చేపట్టిన మిషన్ భగీరథ నల్లాల ఆన్‌లైన్ సర్వేను శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజు, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శులు వికాస్, నిట్టు, శ్రావణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

స్వప్నకు డాక్టరేట్



నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని రాంనగర్‌కు చెందిన పసుల స్వప్నకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'రవికంటి వసుందస్ రచనలు–సమగ్ర అధ్యయనం' అంశంపై సమర్పించిన థీసిస్‌కు కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ చేతుల మీదుగా స్వప్న శనివారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. స్వప్న గతంలో నిర్వహించిన పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొన్నారు. పలు రచనలు ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన స్వప్నకు పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

18న జాబ్‌మేళా

కాశోజీ సెంటర్: జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ఈనెల 18న ములుగు రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటలో తెలిపారు. హైదరాబాద్‌లోని కృషివిజ్ఞాన్ ఫర్టిలైజర్స్‌లో 67 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, అగ్రికల్చరల్, మార్కెటింగ్ అర్హతతోపాటు 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని, వివరాలకు 9963177056 , 9177097456 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

లింకేజీ రుణాల్లో గీసుకొండ టాప్

- గత ఏడాది ఎస్‌హెచ్‌జీలకు రూ.53 కోట్ల రుణాలు



గీసుకొండ: పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు అత్యధికంగా బ్యాంకు లింగేజీ రుణాలను అందించి గీసుకొండ మండలం ఉమ్మడి వరంగల్ జిల్లాలో టాప్‌గా నిలిచింది. ప్రగతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో బ్యాంకు లింగేజీ రుణాలను రూ.30 కోట్ల మేర అందించాలని లక్ష్యంగా నిర్ణయించి రూ.53 కోట్ల మేర రుణాలు అందించి ముందు నిలిచారు. అత్యధిక లింకేజీ రుణాలను అందించినందుకు ఏపీఎం సురేశ్‌కుమార్, సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కవిత, సుష్మితను శనివారం హైదరాబాద్‌లో ఎంసీఆర్‌డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, సెర్ప్ సీఈఓ అనితారాంచంద్రన్, పంచాయతీ రాజ్, రూరల్‌డెవలప్‌మెంట్ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా అభినందించారు. అలాగే, 2024–25 ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ రూపొందించి బ్యాంకు లింకేజీ రుణాలను అందించాలని వారు కోరారు.

నేడు 144 సెక్షన్

వరంగల్ క్రైం: సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కమిషనరేట్ ఇన్‌చార్జ్ సీపీ అభిషేక్ మహంతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిషేధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నాన్నే నా ధైర్యం



ముగ్గురు ఆడపిల్లలని ఎన్నడూ బాధపడలేదు

- మహాలక్ష్ములు పుట్టారని సంతోషించేవారు
- నా ఇష్టాలను ఎప్పుడూ కాదనలేదు
- 2016లో రాజకీయాల్లోకి వస్తానంటే సమయం ఉందన్నారు..
- ఎనిమిదేళ్ల తర్వాత తీసుకువచ్చారు.. నిలిచి గెలిచారు..
- ఎన్నికల సమరంలో ప్రతీక్షణం నా వెనుకాలే ఉన్నారు..
- 'సాక్షి'తో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



'సాధించాలన్న పట్టుదల, ఆశయ సాధన కోసం శ్రమించే తీరు.. ఇవన్నీ నాన్న నాకు ఇచ్చిన ఆస్తులు. ముక్కుసూటిగా మాట్లాడే నాన్నంటే ఇప్పటికీ ఎంతో ఇష్టం. ఆయనే నా ధైర్యం.. నాన్న పక్కన ఉంటే కొండంత అండ ఉంటుందనిపిస్తుంది' అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అంటున్నారు. కూతురిని తన వారసురాలిగా రాజకీయాల్లోకి తీసుకురావాలని, తనలా ప్రజాప్రతినిధి చేయాలన్న తండ్రి కల నెరవేరింది. మొదటినుంచి తన వెన్నెముకగా నిలిచి కూతురిని రాజకీయ అరంగ్రేటం చేయించి పక్కా ప్రణాళికతో విజయం సాధించారు. తండ్రి ఆశయం మేరకు కూతురు కావ్య ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌నుంచి వరంగల్ రెండో మహిళా పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నికై చట్టసభల్లో అడుగుపెట్టారు. నేడు (ఆదివారం) ఫాదర్స్ డేని పురస్కరించుకుని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఆమె తండ్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో ఉన్న ఆప్యాయత, అనుబంధాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆమె మాటల్లోనే.. - హన్మకొండ చౌరస్తా

మేము నాన్నకు ముగ్గురు కావ్య, దివ్య, రమ్య కూతుళ్లం. నాన్న హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహించేవారు. సరిగ్గా నేను ఏడో తరగతి చదువుతున్న సమయంలో ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లో వచ్చారు. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అయినప్పటికీ నాన్న మా ముగ్గురిని చాలా గారాబంగా పెంచి, చదివించారు. ముగ్గురు ఆడపిల్లలు అన్న సామాజిక అంశం అక్కడక్కడ ప్రస్తావన వచ్చేది. అప్పుడు మానాన్న ఒక్కటే చెప్పేవారు నాకు ముగ్గురు మహాలక్ష్మీలు పుట్టారని చాలా సంతోషించేవాడు. నాన్న రాజకీయాల్లోకి వచ్చాక మాతో గడిపేందుకు ఎక్కువ సమయం ఉండేది కాదు. కానీ మా అవసరాలను ఎన్నడూ కాదనలేదు. ఎంత రాత్రి అయిన, ఉదయమైనా మా ముఖ కవళికలను బట్టే మాకు ఏం కావాలో తెలుసుకుని ఇచ్చేవారు. పదవ తరగతి పూర్తయ్యాక, ఇంటర్ ఆ తర్వాత హైదరాబాద్‌లోని డెక్కన్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. స్కూల్ ఎడ్యుకేషన్ తర్వాత నాన్నతో అన్నీ విషయాలను పంచుకునేదాన్ని. జీవితంలో ఏ స్టెప్ తీసుకోవాలన్న నాన్నతో చర్చించి, నిర్ణయం తీసుకోవడమే. ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడే నా భర్త(నజీర్) పరిచయం అయ్యాడు. ఇద్దరం ఇష్టపడ్డాం. ఈ విషయాన్ని నాన్నకు చెప్పా. రెండు రోజులు ఆలోచించి నీ సంతోషమే నాకు ముఖ్యమంటూ మా పెళ్లికి అంగీకరించారు. పెళ్లి.. ఆ తర్వాత జాబ్ రీత్యా ఇద్దరం ఇక్కడే స్థిరపడిపోయాం. మాకు ఇద్దరు ఆడపిల్లలు దియా, మెహిరా.

ప్రతీక్షణం నా వెనుకాలే..



ఎన్నికల ప్రచారంలో తండ్రి కడియం శ్రీహరితో కూతురు కావ్య (ఫైల్)

రాజకీయ అరంగేట్రం చేస్తున్న సమయంలో నాన్న ప్రతీక్షణం నా వెనుకాలే ఉన్నారు. ఎంపీ టికెట్ వచ్చిన మొదలు గెలిచే వరకు ఒకటీరెండు మీటింగులు తప్పితే అత్యధిక సమావేశాలు, సభలకు నాన్న నా వెంటే ఉంటూ నా వెన్నెముకలా నిలిచారు. సభల్లో ఎలా మాట్లాడాలి.. ఏయే అంశాలు ప్రస్తావించాలి.. మొదలు ప్రతిదీ చిన్నపిల్లలకు మాదిరిగా చెప్పేవారు. మడికొండలో సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రసంగించే సమయంలో నాన్న ఉన్నాడన్న ధైర్యమే నన్ను నిలబెట్టింది.


నేడు ఫాదర్స్ డే

సమయం వచ్చినప్పుడు చెబుతా అన్నారు..

ప్రజాప్రతినిధి హోదా ఉంటే ప్రజలకు, సామాజిక సేవ మరింత ఎక్కువ చేయొచ్చని అనిపించింది. ఈ విషయాన్ని 2016లో నాన్న డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో ఆయన దృష్టికి తీసుకెళ్లాను. అప్పుడు నాన్న రాజకీయాలంటే అంత సులువు కాదు.. సమయం వచ్చినప్పుడు నేనే చెబుతా అని సర్దిచెప్పారు. ఎనిమిది సంవత్సరాల తర్వాత రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. ఇందులో సమయస్ఫూర్తి, ఓర్పు ఉండాలని పదే పదే చెబుతుంటారు.

మానసిక ధైర్యం నూరిపోశారు..

నా జీవితంలో ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికలు మరిచిపోలేని తీపి గురుతులు. కడియం శ్రీహరి కూతురిగా రాజకీయాల్లోకి వచ్చిన నాపై ప్రత్యర్థులు చేసిన ఆరోపణలు కొంత బాధగా అనిపించాయి. అప్పుడు నాన్న ఏనుగు వెళ్తుంటే కుక్కలు మొరుగుతాయని పట్టించుకోవద్దని మానసిక ధైర్యం నూరిపోశారు. ఆత్మస్థైర్యంతో రాజకీయ ప్రచారంలో పాల్గొన్నా. ఎంపీగా నా విజయం కోసం నాన్న ఇచ్చిన ప్రోత్సాహం ఎప్పటికీ మరిచిపోలేను.



డాక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు ఆ కేసులతోనే..

డాక్టర్‌గా పనిచేస్తున్నప్పుడే ఎక్కువ శాతం మహిళలు గర్భసంచి సమస్యతో బాధపడేవారు వచ్చేవారు. ఎందుకీ సమస్య అంటూ ఆరా తీయగా కౌమారదశలో వచ్చే పీరియడ్స్‌కు సరైన ప్యాడ్లు వినియోగించకపోవడమని తెలిసింది. ఆ సమస్యకు పరిష్కారం కోసం వెంటనే కడియం ఫౌండేషన్ ద్వారా బాలికలకు ప్యాడ్లు పంపిణీ చేయడం ప్రారంభించా. సంవత్సరంలో పదివేల మందికి ప్యాడ్లు పంచా. నాన్న విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడే అప్పటి ప్రభుత్వం ఒకే సంవత్సరంలో 6.5లక్షల మంది బాలికలకు పంపిణీ చేసినట్లు తెలిసింది.

నాన్న ప్రోత్సాహంతో ముందుకెళ్తున్నా..



పాలకుర్తి: నా జీవిత ప్రయాణంలో నాన్న ప్రోత్సాహం ఎంతో ఉంది. మేం ఇద్దరం అక్కాచెల్లెళ్లం. నాన్న హైదరాబాద్‌లో బీటెక్ వరకు చదివించారు. వివాహం తర్వాత అమెరికాలో మేనేజర్‌గా పనిచేశా. మా అత్తమ్మ ఝాన్సీరెడ్డి ఆహ్వానంతో రాజకీయాల్లోకి వచ్చా. ఇందులో మా నాన్న మామిడాల తిరుపతిరెడ్డి ప్రోత్సాహం కూడా ఎంతో ఉంది. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా నాన్న వెన్నంటి నడిపించారు. ఆయన ప్రోత్సాహంతో సభలు, సమావేశాల్లో పాల్గొన్నా. ఘన విజయం సాధించా. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

– మామిడాల యశస్వినిరెడ్డి, ఎమ్మెల్యే, పాలకుర్తి

సాటివారికి ఉపయోగపడాలనేవారు..



సాక్షి, మహబూబాబాద్ : మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న ఇరిగేషన్ శాఖలో చిన్న ఉద్యోగి. అయినా ఆయన ఆలోచనలు పెద్దగా ఉండేవి. ఎవరు ఎన్ని చెప్పినా పిల్లలను బాగా చదివించాలన్నదే ఆయన లక్ష్యం. అదే దిశగా నాతోపాటు ముగ్గురు అన్నలను పెంచారు. ఏ పనిచేసినా.. ఉద్యోగం చేసినా.. సాటివారికి ఉపయోగపడాలి, విలువలతో కూడిన జీవితం గడపాలన్నదే ఆయన ఆలోచన. ఆ విషయాలే ఎప్పుడూ చెబుతుండేవారు. ఆయన ఆఫీసుకు వచ్చిన పెద్ద ఆఫీసర్లు, వారు ప్రజలకు, ఉద్యోగులకు చేస్తున్న మేలు వివరించేవారు. ఎక్కువ మందికి ఉపయోగపడాలి. సాయం చేయాలంటే పెద్ద ఉద్యోగాలు సాధించాలనేవారు. అందుకోసం కష్టపడాలి అని చెప్పి చదివించేవారు. ఆయన మాటలే నన్ను ఐపీఎస్ చదివేలా చేశాయి. నాకు ఐపీఎస్ వచ్చిన వార్త వినగానే నాన్న కళ్లల్లో ఆనంద బాష్పాలు.. కుటుంబ సభ్యుల సంతోషం.. ఇప్పటికీ గుర్తుకొస్తాయి. కష్టం విలువ తెలియజేసిన మా నాన్న రాంనాథ్ కేకన్ నా నిజమైన హీరో.. ఆయనే నాకు స్ఫూర్తి.. ఆదర్శం..ఆచరణ.

– మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

'కల్యాణలక్ష్మి'పై విచారణకు ఆదేశం

ఖానాపురం: మండల కేంద్రానికి చెందిన ఓ యువతి పేరుతో రెవెన్యూ అధికారులు కల్యాణలక్ష్మి చెక్కు అందజేసిన విషయంపై విచారణ ప్రారంభమైంది. 'వధువు పేరుతో కల్యాణలక్ష్మి చెక్కు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి స్పందించి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. అవకతవకలపై విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికుమార్‌ను ఆదేశించారు. 'సాక్షి'లో వచ్చిన కథనం ఆధారంగా వివరాలు అందించాలని ఆర్‌ఐ సత్యనారాయణకు తెలిపారు. చెక్కు వివరాలతోపాటు దరఖాస్తు, ఆన్‌లైన్‌లో పొందుపర్చిన వివరాలు సేకరిస్తున్నారు. విచారణకు ఆదేశించడంతో తప్పు చేసిన అధికారుల్లో అలజడి మొదలైనట్లు తెలుస్తోంది. తప్పును సరిదిద్దుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికుమార్‌ను వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం. తప్పు జరిగినట్లు తెలిస్తే ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా..

వధువు పేరుతో కల్యాణలక్ష్మి చెక్కు కథనం 'సాక్షి'లో రావడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విషయం తెలుసుకున్న ఇంటెలిజెన్స్ అధికారులు మండల కేంద్రంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది.కల్యాణలక్ష్మిపై వివరాలుసేకరించినట్లు సమాచారం.

జాతీయ నృత్యపోటీల్లో శ్లోకకు ప్రథమ స్థానం



జాతీయ స్థాయి నృత్యపోటీలో అవార్డు, సర్టిఫికెట్స్ అందుకుంటున్న శ్లోక, సమీక్ష

కాజీపేట రూరల్: కాజీపేటకు చెందిన చిన్నారి శ్లోక ఇటీవల ఒడిశాలోని పూరి జగన్నాథ ఆలయంలో కథక్ రాకర్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి డ్యాన్స్ అండ్ మ్యూజిక్, ఫైన్ ఆర్ట్స్ తరాంగస్–24 పోటీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎ.కమలాకర్ కూతురు శ్లోక ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొని భరత నాట్య విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా విద్యార్థిని సమీక్ష కూడాపాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. శ్లోక, సమీక్షను శ్రీ శివసాయి నృత్య అకాడమీ గురువు దేవులపల్లి దివ్య, రైల్వే అధికారులు అభినందించారు.

కుటుంబ సర్వే గడువు పొడిగింపు

- న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం యాప్‌లో నమోదు



కాశోజీ సెంటర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రభుత్వం కుటుంబ సర్వే నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా రూపొందించిన న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లాలోని వరంగల్, వర్ధన్నపేట, నర్సంపేట ప్రాజెక్టుల పరిధిలో 919 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో కుటుంబ సర్వే 10 రోజుల నుంచి కొనసాగుతోంది. సర్వే ఈనెల 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశాలు వచ్చాయి. సమయానికి సర్వే పూర్తి కాకపోవడంతో ఈనెల చివరి వరకు పూర్తిచేయాలని గడువు పొడిగించారు. ఈ సర్వే ద్వారా ప్రీస్కూల్ పిల్లలు, శిశువులు, గర్భిణులు, బాలింతల వివరాలతో పాటు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య తేల్చనున్నారు.


జిల్లాలోని మూడు ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల వివరాలు..

ప్రాజెక్టు	సెంటర్లు	గర్భిణులు	పాలిచ్చే తల్లులు	పిల్లలు
వరంగల్	249	2,281	2,080	14,853
నర్సంపేట	345	1,590	1,525	13,121
వర్ధన్నపేట	325	1,308	1,269	12,303

అర్హులకే సంక్షేమ పథకాలు అందించేందుకు..

జిల్లాలోని 919 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కుటుంబ సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే వివరాలను న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకే అందనున్నాయి. ప్రీ స్కూల్ పిల్లలకు ప్రతిరోజు ఒక గుడ్డు, ఇతర పదార్థాలు, అదే విధంగా పౌష్టకాహారం, ఏడు నెలల చంటి పిల్లల నుంచి మూడేళ్ల చిన్నారులకు బాలామృతం, గుడ్లు, పాలు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు.

యాప్‌లో వివరాల నమోదు..



అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కుటుంబ సర్వే చేస్తున్నారు. వివరాలు కూడా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌లో నమోదు చేస్తున్నారు.

– జి.హైమావతి, జిల్లా సంక్షేమ అధికారి

అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దు

- మేయర్ గుండు సుధారాణి
- ఇంజనీర్లతో సమీక్ష

వరంగల్ అర్బన్: ఎన్నికల కోడ్ ముగిసినందున పెండింగ్‌లో ఉన్న, ప్రారంభానికి నోచుకోని అభివృద్ధి పనుల్లో జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ డివిజన్ల వారీగా వివిధ అభివృద్ధి పనులపై ఇంజనీర్లతో సమీక్షించారు. ఈసందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. మహానగరంలో పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్, సీఎంఏ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, స్మార్ట్‌సిటీ తదితర పథకాల వివరాలపై ఆరా తీశారు. టెండర్లు పూర్తయిన పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలన్నారు. జనరల్ ఫండ్ కింద ఇంకా మిగిలి ఉన్న పనులకు వెంటనే టెండర్ పూర్తి చేయాలన్నారు. సమీక్షలో ఈఈలు శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, డీఈలు రవి కుమార్, సంతోశ్‌బాబు,రవికిరణ్, సారంగం, రంగారావు, జేఎఓ సరిత, ఏఈలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది జవాబుదారీగా నిలవాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. శనివారం హనుమకొండ 9వ డివిజన్‌లోని అలంకార్ జంక్షన్, కాకతీయ కాలనీ, యాదవనగర్ ఈఎల్‌ఎస్‌ఆర్, అమృత్ థియేటర్, హనుమకొండ పోస్టాఫీస్, చౌరస్తా తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో మేయర్, కమిషనర్ పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాకతీయ కాలనీలో కల్వర్టు శిథిలావస్థకు చేరిందని, నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలు రోడ్డుపై ఉన్నందున ఆ యజమానికి లీటర్ పెనాల్టీ విధించాలని సీఎంహెచ్‌ఓను ఆదేశించారు. డివిజన్ కార్పొరేటర్ చీకటి శారద ఆనంద్, ఎస్‌ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌ఓ రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న ఉన్నారు.

కలెక్టర్‌గా సత్యశారదాదేవి

- ప్రావీణ్య హనుమకొండకు బదిలీ



సత్యశారదాదేవి



ప్రావీణ్య

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా కలెక్టర్‌గా 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు ఎం.సత్యశారదాదేవి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఎం.ప్రావీణ్య హనుమకొండ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో సత్యశారదాదేవిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యవసాయ, కోఆపరేషన్ విభాగ సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్న శారదాదేవి తొలిసారి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించే అవకాశముందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఆమెకు రెవెన్యూ విభాగంపై మంచి అవగాహన ఉండడంతో భూసంబంధిత సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కారమయ్యే అవకాశముందని చర్చ జరుగుతోంది. కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూకు సంబంధించిన భూసమస్యలే ఎక్కువగా ఉండడంతో సులభంగా పరిష్కారమయ్యే అవకాశముంది. ధరణి పోర్టల్ స్థానంలో ప్రభుత్వం భూమాత పోర్టల్ తీసుకురానున్న నేపథ్యంలో కలెక్టర్‌గా సత్యశారదాదేవిని నియమించారని తెలుస్తోంది.

'ప్రావీణ్య'ం ప్రదర్శించారు..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ప్రావీణ్య 2021 మార్చి 14న వరంగల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా వరంగల్ నగరంపై ఆమెకు అవగాహన ఉండడంతో కలెక్టర్‌గా ఈ మూడేళ్ల మూడు నెలల కాలంలో తనదైన మార్క్ చూపించారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. బాధితులకు పరిహారం అందించి పనులు ముందుకెళ్లేలా చొరవ చూపారు. వరంగల్‌లో కొత్త బస్టాండ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నగరంలో వరదలు వచ్చిన సమయంలో సహాయక చర్యలు తీసుకోవడంలో ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. నర్సంపేటలో జిల్లా వైద్యకళాశాల నిర్మాణ పనులపై శ్రద్ధ పెట్టారు. నిర్దేశించిన గడువులోపే ప్రభుత్వ పాఠశాలలకు మహిళల సమాఖ్య చేత స్కూల్ యూనిఫాం కుట్టించి అందజేసి, జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచారు.

18న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

హన్మకొండ: వరంగల్ అర్బన్ జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాన్ని ఈనెల 18న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యలత తెలిపారు. హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2, 3, 5, 6వ స్థాయీ సంఘాల సమావేశం ఉదయం 10.30 గంటలకు, 4వ స్థాయీ సంఘం సమావేశంలో 11.30 గంటలకు, 7వ స్థాయీ సంఘం సమావేశంలో మధ్యాహ్నం 12 గంటలకు, 1వ స్థాయి సంఘం సమావేశం మధ్యాహ్నం 1 గంటకు జరుగుతుందని తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సీఈఓ కోరారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా విజయభాను

- ప్రస్తుత ఆర్‌ఎం జాస్తి శ్రీలత బదిలీ

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా హైదరాబాద్ చార్మినార్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్)గా పనిచేస్తున్న డి. విజయభాను నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆర్‌ఎంగా ఉన్న జాస్తి శ్రీలతను రంగారెడ్డి రీజినల్ మేనేజర్‌గా బదిలీ చేస్తూ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీలత 2022, నవంబర్ 18న వరంగల్ ఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఏడాదిన్నరపాటు పనిచేశారు.

'కుడా' వైస్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ



నయీంనగర్: 'కుడా' వైస్ చైర్‌పర్సన్‌గా అశ్విని తానాజీ వాకడే శనివారం 'కుడా' కార్యాలయంలో అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఉన్నతాధికారులు సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, సెక్రటరీ మురళీధర్‌రావు, సత్యనారాయణ వైస్ చైర్‌పర్సన్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అశ్విని తానాజీ వాకడే జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. 'కుడా' వైస్ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు.

సమీక్షపై విజిలెన్స్ విచారణ

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్‌లోని ఓ డివిజన్‌లో జరిగిన సమీక్ష సమావేశంపై ఎన్పీడీసీఎల్ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 13న 'సమీక్షలో ఇదేం వివక్ష' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ సమావేశంలో డివిజన్ అధికారి చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న యాజమాన్యం విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఎన్పీడీసీఎల్ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. సమావేశంలో జరిగిన చర్చ, చర్చకు దారితీసిన కారణాలు, ఇతర అంశాలపై కూలంకశంగా విచారిస్తున్నట్లు సమాచారం.

యువకుడి ఆత్మహత్య

మామునూరు: తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓయువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన శనివారం తెల్లవారుజామున టీఎస్ఎస్పీ బెటాలియన్ ఓల్డ్ క్వార్టర్స్ (పురాతన భవనం)లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ పురాతన భవనంలో మహ్మద్ శౌకత్‌అలీ కుటుంబం నివాసం ఉంటున్నాడు. శౌకత్ అలీ కుమారుడు యాసర్ అరాఫత్ (23) ఇంటిపట్టునే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి లోనై శనివారం తెల్లవారు జామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మామునూరు పోలీసులకు సమాచారం అందజేయగా.. ఎస్సై కృష్ణవేణి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకుగల కారణాలను సేకరించారు. మృతుడి తండ్రి శౌకత్‌అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాతావరణ పరిస్థితులు తెలుసుకోవడంపై శిక్షణ



వాతావరణ పరిస్థితులు తెలుసుకోవడంపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.జి.మహాదేవప్ప

హన్మకొండ: వాతావరణ పరిస్థితులు తెలుసుకోవడంపై మధ్య తెలంగాణ మండల పరిధిలోని వ్యవసాయ పరిశోధన స్థానాల సేద్య విభాగం శాస్త్రవేత్తలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం శనివారం వరంగల్ పైడిపల్లిలోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగింది. హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం సైంటిస్టు డాక్టర్ ఎస్.జి.మహదేవప్ప శిక్షణ ఇచ్చారు. వాతావరణ పరిశీలన మూలకాలైన వర్షపాతం, పగలు, రాత్రి ఉష్ణోగ్రత, గాలిలో తేమ, సూర్యరశ్మి, గాలి వేగం, గాలి దిశ, నీటి బాష్పోత్సేకం, వ్యవసాయ పరిశోధనలో వీటి ప్రాముఖ్యతపై వివరించారు. వాతావరణ మూలకాల పనితీరు. డేటా సేకరణపై శిక్షణ ఇచ్చారు. వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.మదు. యు.నాగభూషణం, భరత్, బి.మాధవి, డి.స్వేత తదితరులు పాల్గొన్నారు.

ఎవరి ట్రాప్‌లో.. ఎవరో

పోలీసులే లక్ష్యంగా మావోయిస్టుల మందుపాతరలు
- ప్రతీ ఏడాది మే- జూన్ మాసాల్లో సరిహద్దుల్లో అలజడి
- పట్టుబడిన మావోయిస్టులు, మిలీషియా సభ్యులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు: గత కొన్ని రోజులుగా ఛత్తీస్‌గఢ్- తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ములుగు జిల్లా వాజేడు- వెంకటాపురం(కె) మండలాల గొత్తికోయ గూడేల్లో ఆందోళనకర వాతావరణం నెలకొంటుంది. మావోయిస్టులను పట్టుకోవడానికి పోలీసు బలగాలు, పోలీసులను బెదిరించడానికి మావోయిస్టులు తీసుకుంటున్న చర్యలు సరిహద్దులో భయోత్పాత సంఘటనలకు దారితీస్తున్నాయి. ఎవరి ట్రాప్‌లో ఎవరు పడతారన్నది ఇక్కడ ప్రధాన అంశం కాగా.. ఇరువురి మధ్య అభంశుభం తెలియని సాధారణ ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదన్నది వాస్తవం.

మావోయిస్టుల మందుపాతరలు

మావోల చర్యలను తిప్పికొట్టడానికి పోలీసులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరు పక్షాలకు మధ్య జరిగిన దాడుల్లో ఎందరో మావోయిస్టులు, పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మరింత అప్రమత్తం అయిన మావోయిస్టులు ప్రతీ ఏడాది మే- జూన్ మాసాల్లో పోలీసుల నుంచి తప్పించుకొని ప్రాణాలు కాపాడుకోవడానికి అటవీ ప్రాంతంలోకి వచ్చేదారులను లక్ష్యంగా చేసుకొని మందుపాతరలు అమర్చినట్లుగా తెలుస్తుంది. ఈ క్రమంలో జూన్ 03వ తేదీన వాజేడు మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల యేసు(56) కొంగాల అటవీ ప్రాంతంలో వంట చెరుకుకోసం వెళ్లి మావోయిస్టులు అమర్చిన మందుపాతర(బూబీ ట్రాప్)ను తొక్కి అక్కడికి అక్కడే మృతి చెందాడు. 13వ తేదీన వెంకటాపురం(కె) మండలం చొక్కాల గ్రామానికి చెందిన డర్రా సునీత కర్రిగుట్టల సమీపంలో అమర్చిన మందుపాతర పేలి ఎడమకాలును కోల్పోయింది. వాజేడు, వెంకటాపురం(ఎం) మండలాల్లో జరిగే స్థానిక జాతరలను పరిగణలోకి తీసుకొని ఈ తతంగం అంతా జరుగుతున్నట్లుగా తెలుస్తుంది. ఈక్రమంలో మావోయిస్టుల చర్యలతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడడంతో అప్రమత్తమైన పోలీసులు కొంగాల, చొక్కాల, కర్రిగుట్ట ప్రాంతాల్లో విస్తృతంగా కూంబింగ్ చేపట్టి, మందుపాతరలను నిర్వీర్యం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ నెల 13వ తేదీన తడపాల గ్రామానికి వెళ్లే క్రమంలో మందుపాతరలు అమరుస్తుండగా వెంకటాపురం(కె)- వాజేడు ఏరియా కమిటీ, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన డిప్యూటీ కమాండర్, ఇద్దరు దళసభ్యులు, ముగ్గురు మిలీషియా సభ్యులను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరు మహిళలు, నలుగురు వ్యక్తులను పట్టుకొని వారి నుంచి డీబీబీఎల్ తుపాకీ, నాలుగు కిట్‌బ్యాగులు, రెండు వాకీ టాకీలు, 17కార్డెక్స్ వైర్లు, ఆరు డిటోనేటర్లు, 12జిలిటెన్ స్టిక్స్, 20బ్యాటరీలు, ప్రెషర్ కుకీ, రెండు మ్యాన్ న్యాక్స్, స్పీకర్లు, టార్చ్‌లైట్లు, కారు తాలులు, రేడియో, 21మావోయిస్టు ప్రభావిత పుస్తకాలు, పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ములుగు ఎస్పీ శబరీశ్ శనివారం వెల్లడించారు. పట్టుబడిన వారిలో వాజేడు-వెంకటాపురం(కె) ఏరియా కమిటీ దళ డిప్యూటీ కమాండర్ కారం భద్రీ అలియాస్ రీతా, పామేడు ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి అలియాస్ మోతే, ఒకటో బెటాలియన్ సభ్యుడు సోడి విజయ్ అలియాస్ ఇడుము, మిలీషియా సభ్యులు కుడం దస్రు, సోడి ఉర్ర, మడకం భీమా ఉన్నారు. ఇందులో కారం భద్రీపై 30 కేసులు ఉన్నాయి. మాడూరి భీమేశ్వర్ రావు, కోర్స రమేశ్, ఇల్లందుల యేసు హత్య, రామానుజపురం శివారులో ప్రోక్లేనర్ తగులబెట్టిన కేసు, వీరభద్రవరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కరపత్రాలు వేసిన కేసు, పార్టీ ఫండ్ వసూళ్లు, ఏఈడీఎస్ అమర్చిన 24 కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. సోడి కోసిపై మొత్తం ఆరు కేసులు ఉన్నాయి. కోర్స రమేశ్, ఇల్లందుల యేసు హత్యలతోపాటు నాలుగు ఐఈడీఎస్ అమర్చిన కేసులు ఉన్నాయి. సోడి విజయ్‌పై నాలుగు, కుడం దస్రుపై ఆరు కేసులు, సోడి ఉర్రపై ఆరు కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. అయితే 12వ తేదీన తడపాల సమీపంలో నిరాయుధులుగా ఉన్న రీతా, మోతీ, ఇడ్మాలను ఎన్‌కౌంటర్ పేరుతో చంపే ప్రయత్నం చేస్తున్నారని 13వ తేదీన వాజేడు- వెంకటాపురం(కె) ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుపై ప్రకటన విడుదల కావడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేయగా పోలీసులు శనివారం అరెస్ట్ చూపారు. అంతకు ముందు జగన్నాధపురం గ్రామానికి చెందిన యేసు మృతి చెందిన సమయంలోనూ శాంత పేరుపై పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా లేఖ విడుదలైంది.

> **మావోయిస్టులు జనంలోకి రావాలి**
> మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి. స్వచ్ఛందంగా లొంగిపోతే ప్రభుత్వం తరఫున పునరావాసం కల్పిస్తాం. వారి కుటుంబాలకు అండగా ఉంటాం. మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దు.
> – డాక్టర్ శబరీశ్, ఎస్పీ, ములుగు జిల్లా

దూరం కుదింపు.. దారి మళ్లింపు

- కాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లపై అధికారుల నిర్ణయం



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా వివిధ రూట్‌లో ప్రయాణించే పలు రైళ్ల దూరాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తగ్గించడంతోపాటు, పలు రైళ్లను దారిమళ్లించినట్లు శనివారం కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. మూడో లైన్ నిర్మాణం, ఇంజనీరింగ్ పనుల నేపథ్యంలో ఈనిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

- భద్రాచలంరోడ్-బల్లార్షా (17033) సింగరేణి, వరంగల్- బల్లార్షా మధ్య, సిర్పూర్‌టౌన్- భద్రాచలంరోడ్ (17034) సింగరేణి, సిర్పూర్- వరంగల్ మధ్య, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ (17011) ఇంటర్‌సిటీ, బెల్లంపల్లి-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య, సిర్పూర్ కాగజ్‌నగర్- బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్, సిర్‌పూర్‌కాగజ్‌నగర్- బెల్లంపల్లి మధ్య, సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, కాజీపేట- కాగజ్‌నగర్ మధ్య, సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్-కాజీపేట మధ్య ఈ నెల 17వ తేదీ వరకు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

పలు వీక్లీ రైళ్ల దారి మళ్లింపు

- ఈ నెల 29నుంచి జూలై 6వ తేదీ వరకు ప్రతి శనివారం గోరఖ్‌పూర్- యశ్వంత్‌పూర్ (12591) ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట మీదుగా కాకుండా వయా సికింద్రాబాద్, కాచిగూడ, నిజామాబాద్ మీదుగా దారి మళ్లించారు. కాజీపేట, రామగుండం, మంచిర్యాల్, బెల్లంపలి, బల్లార్షా స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేశారు. యశ్వంత్‌పూర్- గోరఖ్‌పూర్ (12592) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24 నుంచి జూలై 1 వరకు ప్రతి సోమవారం వయా నిజామాబాద్ మీదుగా దారి మళ్లించి బల్లార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల్, రామగుండం, కాజీపేటలో హాల్టింగ్‌ను ఎత్తివేశారు. ఈ నెల 26నుంచి జూలై 3 వరకు గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ (12589) ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం వయా నిజామాబాద్ మీదుగా దారి మళ్లించి బల్లార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల్, కాజీపేటలో హాల్టింగ్‌ను ఎత్తివేశారు. ఈ నెల 27 నుంచి జూలై 4 వరకు ప్రతి మంగళవారం సికింద్రాబాద్-గోరఖ్‌పూర్ (12590) ఎక్స్‌ప్రెస్ వయా నిజామాబాద్ మీదుగా దారి మళ్లించి బల్లార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల్, రామగుండం, కాజీపేటలో హాల్టింగ్‌ను ఎత్తివేశారు.

డైలీ ఎక్స్‌ప్రెస్‌ల దారి మళ్లింపు

- జూలై 4,5,6 తేదీల్లో సికింద్రాబాద్- న్యూఢిల్లీ (12723) డైలీ ఎక్స్‌ప్రెస్, జూలై 3,4,5 తేదీల్లో న్యూఢిల్లీ-హైదరాబాద్ (12724)డైలీ ఎక్స్‌ప్రెస్ వయా కాజీపేట కాకుండా సికింద్రాబాద్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లించి బల్లార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల్, రామగుండం, కాజీపేటలో హాల్టింగ్‌ను ఎత్తివేసినట్లు అధికారులు వెల్లడించారు.

హత్య మిస్టరీ వీడేదెన్నడు..?

- ఆరు నెలలైనా చిక్కని నిందితులు
- దాదాపు 78మందిని విచారించిన పోలీసులు



కోన విజయ (ఫైల్)

కాజీపేట: ఆరుపదుల వయస్సు దాటిన ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా కొట్టి చంపి ఆరు నెలలు గడిచినా హంతకుల ఆనవాళ్లు పోలీసులకు చిక్కకపోవడం పట్టణంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కాజీపేట పట్టణం 62వ డివిజన్ రహమత్ నగర్ కాలనీలో ఉండే కోన విజయ (68) గత ఏడాది డిసెంబర్ 14న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అర్ధరాత్రి విగతజీవిగా ఇంటి పక్క సందులో కనిపించింది. విజయ శరీరంపై దుస్తులు సరిగ్గా లేక పోవడంతోపాటు బంగారు నగలు కనిపించకుండా పోయాయి. వెంటనే స్థానికుల సాయంతో మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విభిన్న కోణాల్లో పోలీసుల విచారణ

క్లూస్ టీం సభ్యులు, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన విజయ.. దాదాపు 16గంటలపాటు పట్టణంలో ఎక్కడ ఉంది.. ఒంటిపై ఉన్న బంగారు నగల కోసమే నిందితులు హత్యచేసి ఇంటి వద్ద పడేశారా..? లేక అప్పుడప్పుడు చిన్న మొత్తంలో నగదును తెల్సిన వాళ్లకు ఇస్తుందనే సమాచారం మేరకు ఆ కోణంలోనూ విచారణ చేసినా ఆచూకీ లభించలేదు.

తెలివిగా వ్యవహరించిన నిందితులు

ఒంటరిగా బయటకు వచ్చిన విజయను ఏమార్చి కిడ్నాప్ చేసిన నిందితులు తలపై బలంగా కొట్టి చంపడంతోపాటు శరీరాన్ని పూర్తిగా సబ్బు పెట్టి కడిగి మృతురాలి ఇంటి పక్కన ఉన్న గల్లీలోనే అర్ధరాత్రి వేళ పడేసి వెళ్లడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. నిందితులతోపాటు చంపిన స్థలాన్ని డాగ్‌స్క్వాడ్ గుర్తించకుండా ఉండేందుకే సబ్బుతో మృతదేహాన్ని కడిగి ఉంటారనే అనుమానం వ్యక్తమైంది. మృతురాలి శరీరంపై ఉన్న బంగారు నగల కోసమే హత్య చేసి ఉంటారా.. లేక ఇతర కారణాలు ఏమైనా ఉంటాయా.. అనే కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నప్పటికి పోలీసులకు నిందితుల ఆచూకీ చిక్కడంలేదు. విజయ హత్య జరిగిన ఈ ఆరు నెలల కాలంలో టాస్క్‌ఫోర్స్, క్రైమ్, స్థానిక పోలీసులు విరామం లేకుండా కేసు మిస్టరీని విప్పేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. హత్య జరిగినప్పుడు ఉన్న అధికారులు బదిలీపై వెళ్లడంతో కొత్తగా వచ్చిన అధికారులు ఆ ఫైల్‌ను తిరిగి తెరచి విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో అధికారులు ఇప్పటి వరకు తమకు అందిన సమాచారం ప్రకారం.. దాదాపు 78మందిని విచారించినా.. ఎలాంటి ఆధారాలు లభించకపోవడం గమనార్హం.

మహిళ కిడ్నాప్‌నకు యత్నం



గుర్తు తెలియని కారు

లింగాలఘణపురం: జనగామ- సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల సమీపంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి డెవలపర్స్ వెంచర్‌లో శనివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో పొలం పనులకు వెళ్తున్న పటేల్‌గూడేనికి చెందిన ఓ మహిళను కారులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించాడు. వివరాలిలా ఉన్నాయి. పటేల్‌గూడేనికి చెందిన మహిళ శ్రీలక్ష్మీనర్సింహస్వామి వెంచర్ సమీపంలో కౌలుకు తీసుకున్న భూమిలో పనులు చేసేందుకు తొమ్మిది గంటల సమయంలో ఒక్కతే వెళ్తోంది. అదే సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి కారులో వచ్చి వెంచర్‌లో ఎవరైనా ఉన్నారా.. అంటూ పలకరిస్తూ కారు దిగి ఆమె వద్దకు వెళ్లాడు. ఎవరు లేరని చెప్పడంతో మహిళ నోరుమూసి కారులోకి ఎక్కించే ప్రయత్నం చేశాడు. ఆమె అరుస్తూ తప్పించుకొనే ప్రయత్నం చేస్తుండగానే ఆటోలో కొంత మంది కూలీలు అటుగా వచ్చారు. వారిని చూసిన సదరు వ్యక్తి కారులో జనగామ వైపు పరారయ్యాడు. సూర్యాపేట రోడ్డుపై ఉన్న ఓ కూల్‌డ్రింక్ డీలర్ షాపులోని సీసీ కెమెరాలో గమనించి తెలుపు రంగు సిఫ్ట్ డిజైర్ కారుగా గుర్తించారు. నంబర్ ప్లేట్ సరిగా కనిపించడంలేదు.

శిక్షణ అంశాలతో బోధన చేయాలి



కేయూలోని వివిధ విభాగాల ఆచార్యులతో శిక్షణ పొందిన అధ్యాపకులు

కేయూ క్యాంపస్: టీచింగ్‌లో ఉన్నతంగా ఉండాలంటే నిరంతరం విద్యార్థిగా ఉండాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకలకు మూడు వారాలుగా యూనివర్సిటీలో నిర్వహించిన ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఈనేపథ్యంలో క్యాంపస్‌లోని ఫిజిక్స్ సెమినార్‌హాల్‌లో నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న అనేక మార్పులను అధ్యయనం వినియోగిస్తే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలిపారు. పరిశోధనపై కూడా దృష్టిసారించాలన్నారు. కేయూ ఇంగ్లిష్ విభాగం అధిపతి డాక్టర్ దీపాజ్యోతి మాట్లాడుతూ.. ఇంగ్లిష్ భాషపై పట్టుతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఆ దిశగా విద్యార్థులుకు నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. ఫిజిక్స్ విభాగం అధిపతి డాక్టర్ మంజుల మాట్లాడుతూ.. ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్ అవసరం అన్నారు. గణితశాస్త్ర విభాగం అధిపతి భారవి శర్మ మాట్లాడు తూ.. కృత్రిమ నేపథ్యంలో గణితం అధ్యాపకులు ముందు వరసలో ఉండాలన్నారు. కేయూ మాజీ రి జిస్ట్రార్ ఆచార్య వెంకట్రామ్‌రెడ్డి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌లాల్, కెమిస్ట్రీ వి బాగం అధిపతి సవితాజ్యోత్స్న మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మామునూర్‌లో షుడా లే అవుట్ రెండు దిశలా చౌరస్తా నుండి మరియు జ్యోతి భాపులే ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్సిఫూరా డాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 268 అమ్మకానికి. 9032111600. [W-1242415]

■ About 250 Sq. Yards to 500 Sq. Yards Residential Plot For Sale. Near NIT, Beside Bishop Beretta School, FatimaNagar. Contact: Jayaraju: 9989635057, Praveen: 8008422520 [HA-13673]

LAND FOR LEASE

■ శ్రీశైలం హైవేకి అనుకొని ముచ్చెర్ల క్రాస్‌లో 3000 గజాలు DTCP 95x288 ft, 3 పక్కల BT రోడ్డు E/F వ్యాపారాలకు అనుకూలం. సంప్ర॥ 9441922102 [HA-1927]

SERVICES

■ మా వద్ద అల్యూమినియం కబోర్డ్స్, UPVC విండోస్, WPVC దర్వాజలు & మెష్ డోర్స్ అన్నిరకాల అల్యూమినియం పనులు చేయబడును. Jaibhavani Enterprises HNK. Cell: 9391122699. [W-1242416]

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 7842279342, హన్మకొండ. [WA-7526]

హోమియో క్లినిక్

■ డా॥బి. పవన్‌కుమార్, సీనియర్ హోమియో ఫిజీషియన్, 33 సం॥ల అనుభవ వైద్యులు. శ్రీ సాయి హోమియో క్లినిక్, విజయటాకీస్ రోడ్డు, హన్మకొండ. అన్ని రకాల వ్యాధులకు శాశ్వత పరిష్కారం కొరకు సంప్రదించండి. ఫోన్:8096623592. [W-1242411]

HEALTH CARE

■ ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును. ✆ 62814 76205, 94403 25526 [M-11669]

OLD AGE HOME

■ ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని చేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్ 8977639664 / 8977639665 [H-799891]

WANTED

■ Wanted Technicians 10th, ITI (P/F) at Rampur Industrial Area, Kazipet, Age: 18 to 40 yrs (10K/M) Cont: 7981016232. [WA-5959]

■ ఆత్మకూర్ మండలం, నీరుకుళ్ళలో గల HP Petrol Pump లో పనిచేయుటకు బాయ్స్ కావలెను. Cont: 9949707672, 8971839573. [W-1264825]

■ Shantiniketan High School, DS Temple Lane, Pinnavari Street, Warangal: Wanted Teachers to teach I to VII Class Maths & English Subjects. Sal: 10,000/- to 15,000/- Contact / Send your Resume. 7995850051. [WA-17113]

■ 5th, 7th చదివిన 5 గురు స్త్రీ, పురుషులు కావలెను. వయస్సు: 18 నుండి 30 లోపు వారు. జీతం: 10,000/- to 15000. సెల్: 9849316058, వరంగల్. [W-1242482]

■ విజయవాడలో పెద్దవారిని/బెడ్ పేషెంట్‌లని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F, ఆయాలు, నర్సులు కావలెను. వసతి + భోజనం + మంచి జీతం. ✆ 91608 35559, 98850 25559 [B-108]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3,500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185211]

■ గైనకాలజిస్ట్ & OT టెక్నీషియన్ కావలెను. అన్ని సదుపాయాలు గల ములుగు, వరంగల్‌లోని ఒక హాస్పిటల్‌లో ఫుల్ టైమ్ కొరకు సంప్రదించండి నెం. 9949015656. [Z-1080589]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి
కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

కేయూకు ప్లాగరిజం సాఫ్ట్‌వేర్

- కేవలం పీహెచ్‌డీ థీసిస్‌లకే వినియోగం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పరిశోధకుల పీహెచ్‌డీ థీసిస్‌లను చెక్ చేసే ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌కు ఇన్‌ఫ్లిబిట్ సంస్థ అనుమతించినట్లు కేయూ యాంటీ ప్లాగరిజం సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్ శనివారం తెలిపారు. భారత ప్రభుత్వ యూజీసీ ఎంహెచ్‌ఆర్‌డీ పరిధిలోని ఇన్‌ఫ్లిబిట్ సంస్థ ఈ సాఫ్ట్‌వేర్‌ను కాకతీయ యూనివర్సిటీకి ఉచితంగానే అందజేస్తుందని తెలిపారు. అయితే వారం రోజుల క్రితం వివిధ యూనివర్సిటీలతోపాటుగా కేయూకు ప్లాగరిజం చెక్ చేసే డ్రిల్‌బిట్ సాఫ్ట్‌వేర్‌ను నిలిపివేసిన విషయం విధితమే. దీంతో పీహెచ్‌డీ పరిశోధకులు తమ థీసిస్‌ను సబ్‌మిట్ చేసేందుకు అవకాశం లేకుండాపోయిందన్నారు. ఎందుకంటే తప్పనిసరిగా పీహెచ్‌డీ థీసిస్‌ను ప్లాగరిజం ఈ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడు చేసి చెక్ చేశాక ఇచ్చే రిపోర్టును బట్టి సబ్‌మిషన్‌కు అవకాశం ఉంటుందని తెలిపారు. థీసెస్‌తోపాటుగా అధ్యాపకుల పరిశోధన వ్యాసాలు కూడా ప్లాగరిజం చెక్ చేస్తుండటంతో సంబంధిత సాఫ్ట్‌వేర్ (సర్వర్)పైన అధిక భారం పడుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ లింక్ నిలిపివేశాక ఇక నుంచి కేవలం పీహెచ్‌డీ థీసెస్ మాత్రమే ప్లాగరిజం చెక్ చేసేందుకు వినియోగిస్తామని లేఖను మెయిల్‌ద్వారా పంపామన్నారు. దీంతో ఆసంస్థ సంబంధిత ప్లాగరిజం సాఫ్ట్‌వేర్ లింకును కేయూకు ఇచ్చిందన్నారు. పరిశోధకుల తమ థీసిస్ సబ్‌మిషన్‌కు ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌లో చెక్ చేసుకోవాలని రాజ్‌కుమార్ పరిశోధకులను తెలిపారు.

చెస్ పోటీల్లో వరంగల్ ట్రాన్స్‌కో విజేత

- రాష్ట్రస్థాయి విద్యుత్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ



విజేతలను అభినందిస్తున్న సీఈ, ఎస్ఈ, తదితరులు

హన్మకొండ: రాష్ట్ర స్థాయి విద్యుత్ సంస్థల చెస్ టోర్నమెంట్ 2024–25 పోటీల్లో వరంగల్ టీజీ ట్రాన్స్‌కో టీం విజేతగా నిలిచింది. ఈనెల 13,14 తేదీల్లో నల్లగొండ సర్కిల్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోటీలు నిర్వహించగా.. ఓవరల్ టీం చాంపియన్స్‌గా నిలువడంపై శనివారం వరంగల్ ములుగు రోడ్డులోని కార్యాలయంలో సీఈ శ్రీరామ్ కుమార్, ఎస్ఈ బి.చంద్రశేఖర్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా సింగిల్స్ ఏఈ పి.రాకేష్ గౌడ్, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ పోటీల్లో టీం విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో ఏఈలు పి.రాకేష్ గౌడ్, పుల్యాల రాజిరెడ్డి, బోరే వంచ రంగారావు, ఆర్టిజన్ తీగల కల్యాణ్ మురళి, జేఎల్ఎం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ట్రెజరర్ కందికొండ మోహన్, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శ్రీలత

చిల్పూరు: ఒకే కులానికి చెందిన ఓ యువతి, యువకుడు ప్రేమించుకున్నారు. నాలుగేళ్ల అనంతరం ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ఆ యువతి ప్రియుడి ఇంటిఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.. ఈఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజవరం గ్రామానికి చెందిన గంగారపు కృష్ణ (హైదరాబాదులో ప్రైవేట్ ఉద్యోగి). ఇదే మండలం చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన చింతల శ్రీలత(హైదరాబాద్‌లో బ్యాంకు ఉద్యోగి) నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈక్రమంలో కొద్ది నెలలుగా శ్రీలత పెళ్లి చేసుకుందామంటూ కృష్ణను ఒత్తిడి చేసింది. దీంతో త్వరలోనే పెళ్లి చేసుకుందామని నమ్మించాడు. అనంతరం వేరే అమ్మాయితో నిశ్చితార్థం చేసుకున్నాడు. విషయం తెలిసిన శ్రీలత పెద్దమనుషుల వద్దకు వెళ్లగా పంచాయతీ కూడా చేశారు. అయినా కృష్ణ వేరే అమ్మాయితో పెళ్లికి సిద్ధమవుతున్నట్లు తెలువడంతో శనివారం రాజవరం గ్రామంలోని ప్రియుడి ఇంటి ఎదుట తనకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులతో కూర్చుంది. అప్పటికే కృష్ణ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పారిపోయారు. రెండు గంటలపాటు వేచి చూసిన శ్రీలత మనస్తాపానికి గురై వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మోసం చేసిన కృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిట్'లెస్' స్కూల్ బస్సులపై కొరడా

- ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఆర్టీఏ దాడులు
- 23 బస్సులపై కేసులు..

సాక్షి ఎఫెక్ట్..



సరైన ధ్రువీకరణ పత్రాలు లేని స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న వరంగల్ ఆర్టీఏ ఎంవీఐ జైపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్: ఫిట్‌నెస్ చేయించుకోని, నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై రవాణాశాఖ కొరడా ఝుళిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 25శాతం స్కూల్‌బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోకుండా రోడ్డు ఎక్కాయని, విద్యార్థుల ప్రాణాలతో పాఠశాలల యాజమాన్యాలు చెలగాటమాడుతున్నాయని శనివారం 'స్కూల్ బస్..ఫిట్‌లెస్' శీర్షికన'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉప రవాణాశాఖ కార్యాలయ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు విద్యాసంస్థల బస్సులను తనిఖీలు చేశారు. 23బస్సులపై కేసులు నమోదు చేశారు. వరంగల్ -5. హనుమకొండ -12, భూపాలపల్లి -2, జనగామ-4 కేసులు నమోదు చేశారు. ఆ బస్సులను సీజ్ చేసి ఆర్టీఏ ప్రాంగణాలకు తరలించారు. కాగా, ఆర్టీఏ అధికారుల తనిఖీల విషయం తెలుసుకున్న చాలా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు సరైన ధ్రువీకరణ పత్రాలు లేని బస్సులను పాఠశాలకే యాజమాన్యాలు పరిమితం చేశారు. స్కూల్ బస్సుల తనిఖీలు కొనసాగుతాయని, కచ్చితంగా నిబంధనలు పాటించాలని డీటీసీ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ తెలిపారు.